41

# కరణం లౌక్యం

'దోమాడి' అనే గ్రామంలో భీమరాజు అనే కరణం ఉండేవాడు.

సాధారణంగా కరణాలు కయ్యాలు పెడుతుంటారని ప్రతీతి. ఇతరుల సంగతి ఏమోగాని.., భీమరాజు విషయంలో మాత్రం ఇది పూర్తిగా నిజం. నిత్యమూ వారికీ వీరికీ తగవులు పెడుతూ వాళ్ళు కొట్టుకు చస్తుంటే చూసి ఆనందిస్తుండేవాడు. తానే తగవులు పెట్టి, మళ్ళీ తానే తీర్చడానికి వెళ్ళి ఇద్దరి దగ్గర నుంచి కూడా డబ్బు గుంజి లాభం పొందుతుండేవాడు.

భీమరాజు బాగా ముసలి వాడైపోయాడు. దీర్ఘవ్యాధితో మంచం ఎక్కాడు. ఇంక ఎక్కువరోజులు బ్రతికే అవకాశం లేదన్న నమ్మకం కలిగాక, గ్రామ పెద్దల్ని తన ఇంటికి రమ్మని కబురుచేశాడు.

కరణం అంతటి వాడు కబురు పెట్టేసరికి, కాదనలేక గ్రామస్తులందరూ బిలబిల లాడుతూ ఆయన ఇంటికి వెళ్లారు.

వాళ్లని చూసి భీమరాజు – "ఊరి పెద్దలారా! నేను ఇంక ఎక్కువ రోజులు బ్రతకను. నేను బ్రతికి వున్నంతకాలం మిమ్మల్ని ఎన్నో బాధలు పెట్టాను. మీలో మీకు తగవులు పెట్టాను. అందుకు ఇప్పుడెంతో పశ్చాత్తాప పడుతున్నాను. మీరందరూ కలిసి వుండాలనే నా కోరిక. అలా ఉండేటందుకు ఒక పద్ధతి ఆలోచించి వీలునామా రాసి సీలు చేసి ఉంచాను. నేను చనిపోయాక ఆ వీలునామా చదివి అందులో ఉన్నట్లుగా చేయండి. అలా చేస్తే నా ఆత్మ శాంతిస్తుంది. నా పాపాల్ని మీరందరూ క్షమించి, ఆ విధంగా చేస్తామని మాట ఇయ్యండి!" అన్నాడు కళ్ళనీరెట్టుకుంటూ.

కరణం కంటినీరు చూసేసరికి కరిగి చేస్తామని మాట ఇచ్చారు.

అటుతర్వాత కొద్దిరోజులకే భీమరాజు చనిపోయాడు.



వెంటనే ఆయన కుమారులు ఊరివారి సమక్షంలో ఆయన వీలునామాను తీసి చదవడం మొదలు పెట్టారు.

"ప్రజలారా! మన గ్రామంలో హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు ఎందరో ఉన్నారు. వీరిలో వీరు అనేక సారులు కలహించుకోవడం, కొట్టుకోవడం, చంపుకోవడం కూడా జరుగుతోంది. నేను చనిపోయాక నా శవానికి జరిగే అంతిమ సంస్కారంవల్ల ఈ మూడు మతాలవారూ కలవాలని నా కోరిక. అందువల్ల నా శవాన్ని తీసుకెళ్లి మన ఊరిలో పెద్ద మసీదులో తగలబెట్టి, ఆ చితాభస్మాన్ని తీసుకుని ఊరి చర్చిలో భద్రపరచవలసింది."

ఆ వీలునామా విని గ్రామస్తులంతా ముక్కుమీద వేలు వేసుకున్నారు.

భీమరాజు చివరికోరిక ప్రకారం- అతని శవాన్ని మసీదులో తగలబెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు హిందువులు.

కాని ,మహమ్మదీయులు- "శవాన్ని మసీదులో తగలబెట్టడానికి అనుమతించం" అన్నారు.

"ఇతర మతస్థుని చితాభస్మాన్ని మా చర్చిలో ఎలా ఉండనిస్తాం?" అని క్రైస్తవులు అభ్యంతర పెట్టడం మొదలుపెట్టారు. దాంతో... మాటా మాటా పెరిగి మూడు మతాల వాళ్ళూ ముమ్మరంగా కొట్టుకోసాగారు.

చివరకి పోలీసులు వచ్చి శవాన్ని హిందూ స్మశాన వాటికలో దహనం చేయించ వలసివచ్చింది.

ఆ తర్వాత కూడా మూడు మతాలవాళ్ళు కీచులాడుకుంటూనే ఉండసాగారు.

అసలు వాళ్ళు ఎల్లప్పుడూ కొట్టుకుంటూ ఉండాలన్న కోరికతోనే భీమరాజు అలా వీలునామా రాశాడు.

అప్పటి నుంచి "దోమాడ కరణం బ్రతికి బాధించాడు..., చచ్చి సాధించాడు!" అన్న సామెత వచ్చింది.

ఆ భీమరాజు పోయినా... ఇప్పటికీ నేర్పుగా మతకలహాలు రెచ్చగొట్టేవారు, మనుషుల మధ్య కీచులాటలు పెట్టే దుర్మార్గులు ఎందరో ఉన్నారు. అలాంటి వారిని జాగ్రత్తగా గమనించి సంఘంలోంచి ఏరివేయాలి.

★★★